క్లుప్తంగా

నేడు జాతీయ సెలవు దినం

అద్దంకి రూరల్: సంయుక్త కార్మిక శాఖ, గుంటూరు ఆదేశాల మేరకు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం జాతీయ సెలవు దినంగా పాటించాలని అద్దంకి కార్మిక శాఖ అధికారి టి. మధుబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అద్దంకి కార్మిక శాఖ పరిధిలోని దుకాణాలు, సంస్థలు, ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులందరికి వేతనంతో కూడిన సెలవు లేదా ప్రత్యామ్నాయ వేతనంతో కూడిన సెలవు ఆదేవారంలో ఇవ్వాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకొంటామని ఆయన హెచ్చరించారు.

నేడు మార్టూరులో ఉచిత వైద్యశిబిరం

మార్టూరు: స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకొని నేడు మార్టూరులో ఉచితత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చాంద్‌బీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక గన్నవరం రోడ్డులో డాక్టర్స్ ఎక్స్‌రే లేబొరేటరీ నందు ఉచిత షుగర్, కిడ్నీ పరీక్షలు నిర్వహిస్తామని, రాయితీపై అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రజలు వినియోగించుకోవాలని నిర్వాహకుడు మొహమ్మద్ షఫీ తెలిపారు.

రేషన్ షాపులపై దాడులు

యద్దనపూడి: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం పలు రేషన్ దుకాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈతనిఖీల్లో పూనూరులోని ఒక రేషన్ షాపులో 16 కింటాళ్ల బియ్యం అక్రమంగా నిల్వలుండటంతో సదరు డీలర్‌పై 6–ఏ కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గీతా రాణి తెలిపారు. బియ్యాన్ని వీఆర్‌ఓకు అప్పగించారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీనియర్ అసిస్టెంట్ సత్యన్నారాయణ, వీఆర్‌ఓలు వసంతరావు, సత్యన్నారాయణలున్నారు.

వార్డు ఎంపిక ఏకగ్రీవం

పర్చూరు (చినగంజాం): మండలంలోని తిమ్మరాజుపాలెం పంచాయతీ వార్డు సభ్యుల ఎంపిక ఏకగ్రీవం అయింది. పంచాయతీలోని వార్డు ఎన్నికలకు ఒక దరఖాస్తు మాత్రమే రావడంతో నామినేషన్ వేసిన గోరంట్ల రజని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ఏ బ్రహ్మయ్య ఫారం 10 జారీ చేశారు.

నేడు స్వాతంత్య్ర దిన వేడుకలు

కారంచేడు: మంగళవారం ఉదయం 9గంటలకు స్వాతంత్య్ర దిన వేడుకలు.. మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఎంపీడీవో డీ విజయలక్ష్మి సోమవారం క ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశ హాలు వద్ద నిర్వహించే స్వాతంత్య్ర దిన వేడుకల్లో జాతీయ జెండాను ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు ఎగురవేస్తారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది హాజరు కావాలని ఆమె కోరారు.

చీరాల మున్సిపల్ కార్యాలయంలో

చీరాల: 77వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉదయం 8.30 గంటలకు జాతీయ పతాకావిష్కరణ ఉంటుందని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్లు బొనిగల జైసన్‌బాబు, శిఖాకొల్లి రామసుబ్బులు, వార్డు కౌన్సిలర్లు హాజరవుతారన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జే.పంగులూరు: ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈఘటన మండలంలోని జాతీయ రాహదారి సమీపంలోని అలవలపాడు వద్ద సోమవారం రాత్రి జరిగింది. అందిన వివరాల మేరకు.. మండలంలోని తూర్పుతక్కెళ్లపాడు గ్రామానికి చెందిన ఎనికపాటి రఘునాథబాబు (54) వ్యవసాయ పనులు ముగించుకుని అద్దంకి వైపు వెళ్తున్నాడు. ఈక్రమంలో ఎరువుల ట్రాక్టర్ అద్దంకి నుంచి అలవలపాడు వైపునకు వెళ్తోంది. గ్రామ సమీపంలోకి రాగానే ఎదురెదురుగా ట్రాక్టర్, బైక్ ఢీకొట్టుకోవడంతో బైక్ మీద నుంచి రఘునాథబాబు కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు ప్రైవేటు వాహనంలో అద్దంకిలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో రఘునాథబాబు కన్నుమూశాడు. సమాచారం అందుకున్న ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎస్సై కేకే తిరుపతిరావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


జరుబులవారిపాలెంలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు


జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న అద్దంకి కేఆర్కే డిగ్రీ విద్యార్థులు

మది నిండా ముమ్వన్నెల జెండా..

- పండుగలా హర్ ఘర్ తిరంగా
- రెపరెపలాడిన మువ్వన్నెల జెండా
- జాతీయ పతాకంతో ర్యాలీలు

కారంచేడు/యద్దనపూడి/మార్టూరు/చినగంజాం: అమర వీరుల త్యాగాలను స్మరించుకునే రోజు ఆగస్టు 15. స్వాతంత్య్ర దినోత్సవం అనగానే ప్రతి భారతీయుడు గర్వంతో ఉప్పొంగిపోతాడు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రజలు ఇంటిపైన జాతీయ జెండాను ఎగుర వేసి దేశభక్తి చాటారు. కారంచేడు మండలం కేంద్రంలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురష్కరించుకొని గ్రామాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు. స్వాతంత్ర పోరాట సమరయోధుల చిత్రపటాలను, జాతీయ జెండాలను చేతబట్టి మేరా భారత్ మహాన్.. హర్ ఘర్ తిరంగా అంటూ నినాదాలు చేశారు. మండలంలోని కారంచేడు, స్వర్ణ, దగ్గుబాడు, గ్రామాల్లో, కుంకలమర్రు చర్చి కాంపౌండ్ పాఠశాలలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలను అభినందించారు. జరుబులవారిపాలెం గ్రామంలోని ఉపాధ్యాయులు విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ చేయించి, మానవహారం చేయించి, ప్రతిజ్ఞలు చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాబూరావు, పీ నాగమణి, సీహెచ్ నాగేశ్వరరావు, ఎన్ త్రివేణి, అనంతపద్మనాగులు, మండవ ప్రమీల, షేక్ హుస్సేన్‌సాహెబ్, శోభాదేవి, డీ రాజేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ

అద్దంకి రూరల్: హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా అద్దంకి కేఆర్కే డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయజెండా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు జాతీయ జెండాలు పట్టుకుని శింగరకొండ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వీ. మోహన్‌రావు, అధ్యాపకులు ఎంవీ సత్యనారాయణ, డీ. రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.


కుంకలమర్రులో లెమన్ స్పూన్ పోటీల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఎమ్మెల్యేపై వచ్చిన ఆరోపణలు అవాస్తవం


ఎమ్మెల్యే కరణాన్ని కలిసిన ఏకగ్రీవంగా ఎన్నికైన వార్డు సభ్యులు

- ఎమ్మెల్యేను కలిసిన ఏకగ్రీవంగా ఎన్నికైన వార్డు సభ్యులు

చీరాల అర్బన్: చీరాల నియోజకవర్గ అభివృద్ధి పాటుపడుతున్న ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తిపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని సర్పంచ్ కందేటి రమణ, ఉపసర్పంచ్ దంతం వెంకటసుబ్బారావులు అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. వేటపాలెం మండలం రామన్నపేట పంచాయితీలో వార్డు సభ్యుల ఎన్నికకు సంబంధించి టీడీపీ నాయకులు, మరికొందరు చేసిన ఆరోపణలలో వాస్తవం లేదన్నారు. రామన్నపేట పంచాయతీ వార్డు ఉప ఎన్నికలకు సంబంధించి ప్రతిపక్షాలు పలు ఆరోపణలు చేశాయన్నారు. నామినేషన్ ఫారాలు ఎత్తుకెళ్లారని, మరికొన్ని కనిపించడం లేదని ఇదంతా ఎమ్మెల్యే వర్గీయులు చేశారని ఎమ్మెల్యే కరణం, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లపై అసత్య ఆరోపణలు చేశారన్నారు. వాటిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 6వ వార్డు ఉప ఎన్నికకు సంబంధించి వార్డు అభ్యర్థిగా నామినేషన్ వేసిన చేవూరి మస్తానమ్మ ఆర్డీఓకు అప్పీలు కూడా చేశారన్నారు. నామినేషన్లన్నింటిని అందరూ అభ్యర్థులు పరిశీలించగా నామినేషన్లు పూర్తి చేయకుండా నామినేషన్ల పత్రాలును ఆర్డీఓ ఆఫీసులో చూపించారన్నారు. అలానే సెల్ఫ్ డిక్లెరేషన్ ఫారంలో అన్ని పూర్తి చేయకుండా వదిలివేయడంతో నామినేషన్లను తిరస్కరణకు గురయ్యాయని తెలిపారు. నూతనంగా ఎన్నికైన వారందరం బడుగు బలహీనవర్గాలకు చెందిన వారమేనన్నారు. మాలో కొంతమందికి చదువు లేని కారణంగా ఎన్నికల అధికారికి వినతిపత్రం అందించి మాకు తోడుగా వ్యక్తిని తీసుకెళ్లామన్నారు. చీరాలలో పరిస్థితులు అందరికి తెలుసునని, ఎమ్మెల్యేగా కరణం ఎన్నికైన తర్వాత చీరాలలో ప్రశాంత వాతావరణం నెలకొందన్నారు. అనంతరం ఎమ్మెల్యే, వెంకటేష్‌లను 6వ వార్డు మెంబర్‌గా పొట్లూరి మహాలక్ష్మయ్య, 10వ వార్డు మెంబర్‌గా జి.నాగరాజుకుమారిలు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రామన్నపేట సర్పంచ్ కందేటి రమణ, మాజీ సర్పంచ్ బట్టా అనంతలక్ష్మి, బట్టా లీలానందప్రసాద్, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, వార్డు మెంబర్లు నర్మదా ప్రశాంతి, కోటిస్వామి గుప్తా, శ్యామ్, అజిజుల్లా, లేళ్ల భాస్కరరావు పాల్గొన్నారు.


వెంకటేష్‌ను కలిసిన ఏకగ్రీవ వార్డు సభ్యులు, నాయకులు

ఆటల పోటీలతో మానసిక ఉల్లాసం


బల్లికురవలో వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న టీమ్



మ్యూజికల్ చైర్‌లో తలపడుతున్న మహిళా ఉద్యోగులు

- సచివాలయ ఉద్యోగులకు క్రీడా పోటీలు

బల్లికురవ: స్వాతంత్య్రం దినోత్సవం సందర్భంగా సచివాలయ ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఉద్యోగులు విధినిర్వహణలో పని ఒత్తిడిల నుంచి వెసలుబాటుకు క్రీడా పోటీలు ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని ఇస్తాయని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ అన్నారు. స్వాతంత్ర దిన వేడుకల్లో భాగంగా సోమవారం స్థానిక పరిషత్ కార్యాలయం వద్ద 20 సచివాలయాల్లో పనిచేస్తున్న వివిధ శాఖల ఉద్యోగులు వీవోఏలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఉపాధి హామీ పథక సిబ్బందికి స్త్రీ, పురుషులకు వేర్వేరుగా క్రీడా పోటీలు నిర్వహించి విజేతల వివరాలను ప్రకటించారు. మంగళవారం జరిగే వేడుకల్లో విజేతలందరికి బహుమతులు అందిస్తామని ఎంపీడీవో వివరించారు

మహిళల విభాగంలో..

స్కిప్పింగ్‌లో పీ. వాణి (పంచాయతీ సెక్రటరీ, కొత్తూరు), కె శ్రీకన్య (వలంటీర్ బల్లికురవ) బీ. కావ్యలక్ష్మీ (ఇంజినీరింగ్ అసిస్టెంట్, చెన్నుపల్లి). మ్యూజికల్ చైర్‌లో జే ఆదిలక్ష్మీబాయి (డిజిటల్ అసిస్టెంట్ ఉప్పుమాగులూరు–2), శిరీషా (డిజిటల్ అసిస్టెంట్ గుంటుపల్లి) జీ. నందిని (వలంటీర్ కొప్పరపాలెం). పాటల పోటీల్లో అరుణ (ఎఎన్‌యం, కేవీ పాలెం), జయమ్మ(వీవోఏ గంగపాలెం) జె చిన్నమ్మాయి (అంగన్‌వాడీ వర్కర్ కొప్పరపాడు). 100 మీటర్ల పరుగు పందెంలో జే శ్రీకన్య (వలంటీర్ బల్లికురవ), జే ఆదిలక్ష్మీ బాయి (డిజిటల్ అసిస్టెంట్ ఉప్పుమాగులూరు 2), వైశీరిషా (డిజిటల్ అసిస్టెంట్ గుంటుపల్లి) విజేతలుగా నిలిచారు.

పురుషుల విభాగంలో..

స్కిప్పింగ్‌లో యం.ఆదర్శ్ (వీపీఏ బల్లికురవ), ఎస్ శాయిబాబు (పంచాయతీ సెక్రటరీ ఎస్ఎల్ గుడిపాడు), రామకోటేశ్వరరావు (ఆఫీస్ సబార్డినేట్ బల్లికురవ). 100 మీటర్ల పరుగు పందెంలో కె.దేవుడు (వలంటీర్ ఉప్పుమాగులూరు), డీ.జితేంద్రరెడ్డి (వలంటీర్, ఉప్పుమాగులూరు), పీ. చందు (వలంటీరు కొప్పరపాలెం). వాలీబాల్‌లో ఉప్పుమాగులూరు టీమ్ ప్రథమ, ఉపాధి పథక హామీ టీమ్ ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఉన్నత పాఠశాల పీడీ బీ. శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్ ఏఈ జీ. హనుమంతరావు వ్యవహరించారు.

విద్యతో పాటు క్రీడలను పోత్సహించాలి



హెచ్‌ఎంకు నగదు అందిస్తున్న సంఘు సభ్యులు

వేటపాలెం: అన్ని పాఠశాలల్లో విద్యతో క్రీడలను పోత్సహించాలని పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు సూచించారు. సోమవారం రైల్వే స్టేషన్ రోడ్డులోగల జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు ఆసంఘం ఆధ్వర్యంలో క్రీడా సామగ్రి కొనుగోలు కోసం రూ. 10,516 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు బట్టా మోహన్‌రావు రావి మాస్తాన్ రెడ్డి, ప్రత్తి శరత్‌బాబు, గుంటి సుబ్రహ్మణ్యం, జీ శేఖర్, పూల శ్రీనివాసరావు, హెచ్‌ఎం కె హిమాజాకు మారి, ఎస్ వసుధకుమారి, వి వెంకటరమణ, పి పద్మ, పాల్గొన్నా రు.

అభ్యర్థులకు గుర్తులు కేటాయింపు

అద్దంకి రూరల్: మండలంలోని శంఖవరప్పాడు 8వ వార్డుకు నిర్వహించనున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు గుర్తులను ఎన్నికల అధికారి సోమవారం ప్రకటించారు. బత్తుల శ్రీనివాసరావుకు ప్రెషర్ కుక్కర్, బాపినెడ్డి రాఘవరెడ్డికి గౌను గుర్తును కేటయించినట్లు తెలిపారు.

ఫిజియోథెరపీతో మెరుగైన ఆరోగ్యం

అద్దంకి: ఫిజియోథెరఫీతో విభిన్న ప్రతిభావంతుల అవయవాల్లో చెప్పుకోదగిన మార్పు వస్తుందని ఫిజియోథెరపిస్ట్ ఇందిరా ప్రియదర్శిని అన్నారు. ఆమె స్థానిక ఫిజియోథెరపీ కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు సోమవారం ఫిజియోథెరపీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమం తప్పకుండా కేంద్రంలో చేసిన వ్యాయామం చేయిస్తే అవయవాల్లో అల్లుకుపోయిన నరాల్లో కదలికల వల్ల అవయవాలు పనిచేయడం ప్రారంభిస్తాయని చెప్పారు. కేంద్రానికి తల్లి, లేదా తండ్రి తీసుకువస్తే వారికి అలవెన్స్ కూడా ఇస్తారని చెప్పారు.

70 మద్యం బాటిళ్లు స్వాధీనం

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో పర్చూరు ఎస్ఈబీ అధికారులు అక్రమంగా నిల్వఉంచిన సుమారు 70 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అందిన వివరాల మేరకు.. సెబ్ సీఐ యశోదరా దేవి స్థానిక కొణిదెన రోడ్డులో ఇద్దరు వ్యక్తులు బెల్టు షాపులు నిర్వహిస్తున్నారనే సమాచారంతో సోమవారం రాత్రి పది గంటల ప్రాంతంలో తమ సిబ్బందితో దాడి చేశారు. అందులో భాగంగా దర్గా సమీపంలోని పక్కపక్కనే నివాసం ఉన్న ఇద్దరు వ్యక్తుల నుంచి 70 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

సంతమాగులూరు (అద్దంకి రూరల్): సంతమాగులూరులో సోమవారం రాత్రి ఎస్సై శివకుమార్ అక్రమంగా మద్యం నిల్వ చేసి అమ్మకాలు జరుపుతున్న కేంద్రాలపై సిబ్బందితో దాడి చేసి 38 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

ఎంపీని కలిసిన శాప్‌నెట్ చైర్మన్


ఎంపీ విజయసాయిరెడ్డిని సత్కరిస్తున్న కృష్ణచైతన్య

అద్దంకి: బాపట్ల జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్‌గా నియమితులైన రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య సోమవారం తాడేపల్లిలోని వారి స్వగృహంలో కలిశారు. మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గంలోని పలు అంశాలగురించి చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఆయన వెంట చౌదరి బాబు, అవిశన ప్రభాకర్‌రెడ్డి, పలువురు నాయకులు ఉన్నారు.

స్పందన అర్జీల విచారణలో అలసత్వం తగదు

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహాశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సూచించారు. సోమవారం తహాశీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాసు పుస్తకాలు, రెవెన్యూ అజమాయిషీ, నాలా కన్వర్షన్, స్పందన అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు సత్వరంగా ప్రభుత్వ సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష పథకంలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో, సచివాలయాల్లో పనిచేసే వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు స్పందన అర్జీలను త్వరగా విచారించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ పి.సురేష్, ఆర్ఐ శేఖర్, వీఆర్వోలు ఉన్నారు.

స్వచ్ఛ పంచాయతీలుగా తీర్చిదిద్దాలి

చీరాల టౌన్: జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా మండలంలోని ప్రతీ గ్రామ పంచాయతీని స్వచ్ఛ పంచాయతీగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో నేతాజీ సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల కార్యదర్శులతో స్వచ్ఛ సంకల్పంపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన జగనన్న స్వచ్ఛ సంకల్పం లక్ష్యాలను పంచాయతీల్లో అమలు చేసి చెత్త రహిత గ్రామాలుగా, స్వచ్ఛ పంచాయతీలుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో నిర్మాణం చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగించుకోవడం ద్వారా చెత్త సమస్య పరిష్కారం అవుతుందన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఈవోఆర్డీ మురళీ బాపూజీ, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు ఉన్నారు.

జాతీయ జెండాలు పంపిణీ

పర్చూరు(చినగంజాం): రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో పర్చూరు మండలం నూతలపాడు మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్ నందు 70 మంది విద్యార్థులకు క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు జాతీయ జెండాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని జెండా ఎగుర వేయాలన్నారు. జెండా పండుగ గురించి అవగాహన కలిగి ఉండాలని, ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో జాతీయ భావం, స్ఫూర్తి నింపాలని ఆకాంక్షించారు. స్కూలు హెచ్‌ఎం జయమ్మ, రోటరీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, సభ్యులు పోలిశెట్టి చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.


జాతీయ జెండాలు పంపిణీ చేసిన రోటరీ సభ్యులు

వెంకట సుబ్బారావుకు సత్కారం

చీరాల రూరల్: ఎస్‌వీఎస్‌అండ్‌ఎస్‌జేఆర్ ఆర్యవైశ్య కళ్యాణ మండపం ఉపాధ్యక్షుడిగా అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన వాకర్స్ అసోసియేషన్ సభ్యులైన మద్దు వెంకట సుబ్బారావును సోమవారం స్థానిక ఎస్‌ఆర్‌అండ్‌పీఎం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అమరా వీరాంజనేయులు, పోలుదాసు రామకృష్ణలు మాట్లాడారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కళ్యాణ మండపం బై ఎలక్షన్‌లో మొదటి ఉపాధ్యక్షుడిగా అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం మంచిపరిణామమని కొనియాడారు. గతంలో జరిగిన మున్సిపల్ ఎన్నికలలో ఆయన వార్డు కౌన్సిలర్‌గా రెండు పర్యాయాలు గెలిచి వార్డు ప్రజలకు మంచి సేవలందించారని, అతని భార్య కూడా రెండు పర్యాయాలు కౌన్సిలర్‌గా గెలుపొందిందని వారు గుర్తు చేశారు. కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు. డాక్టర్ వరికూటి అమృతపాణి, చారుగుళ్ల ప్రసాద్, చింతా రమేష్, శీరాం రమేష్, జాలాది కృష్ణ, వీరారెడ్డి, షేక్ దరియా సాహెబ్, వంగర పూర్ణ చంద్రరావు, సుధాకర్, దేగల తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రిటైర్డు ఉద్యోగుల సంఘ వార్షికోత్సవం

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం చీరాల యూనిట్ 27వ వార్షికోత్సవాన్ని సోమవారం పట్టణంలోని ఎస్‌జె రంగనాయకులు, బాపనమ్మ కళ్యాణ మండపంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనమండలి మాజీ సభ్యులు కత్తి నరసింహారెడ్డి, సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆల్ఫ్రెడ్‌లు హాజరయ్యారు. కార్యక్రమానికి చీరాల యూనిట్ అధ్యక్షుడు బత్తుల బ్రహ్మారెడ్డి అధ్యక్షత వహించారు. సంఘ అభివృద్ధికి అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సభ్యులను ముఖ్యఅతిథులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏకాంబరేశ్వరబాబు, కార్యదర్శి గోర్పుని శివప్రసాదరావు, కోశాధికారి గుత్తి శివకుమార్, మార్కాపురం వెంకటరామారావు, భాగి కృష్ణమూర్తి, బాపయ్య, వెంకటేశ్వరరెడ్డి, బాపట్ల జిల్లా అధ్యక్షుడు వైవీ నరసింహారావు పాల్గొన్నారు.